# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం | 25 మార్చి 2025 | ■ 12 పేజీలు


## నీటి వనరుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపండి

- నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్‌గా నార్నూర్ మండలం ఎంపిక
- వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా



10

నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్‌గా ఎంపిక చేసిన నార్నూర్ మండలంలో నీటి వనరుల పునరుద్ధరణకు అవసరమై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ యుగల్ జోషి సూచించారు. సోమ వారం న్యూఢిల్లీ నుంచి నీటి వనరుల పునరు జ్జీవనం అమలుపై గుర్తించబడ్డ ఆకాంక్షాత్మక బ్లాక్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. చెరువుల్లో పూడికతీతతో నీటినిల్వలు పెరిగి, భూగర్భజలాల అభివృద్ధితోపాటు చెరువుల పరిధిలోని ఆయకట్టు సాగుకు నీరు అందు బాటులోకి వస్తుందన్నారు.

# విస్తరణపై గంపెడాశలు

6లో

- ఉగాదికి మంత్రివర్గ విస్తరణ ■ ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్ ■ ఢిల్లీకి పార్టీ పెద్దలు
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..
- కేబినెట్‌లో చోటు దక్కించుకునేందుకు ఉమ్మడి జిల్లా నేతల ముమ్మర ప్రయత్నాలు
- ఈ ముగ్గురిలో ఒకరికి ఖాయమంటున్న పార్టీ పెద్దలు ■ తెరపైకి ఎమ్మెల్సీ దండే విఠల్ పేరు
- హస్తంలో మొదలైన అంతర్మథనం..? ■ ఎస్టీ కోటాలో మంత్రి పదవిపై వెడ్మ బొజ్జు నమ్మకం

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి



ఆశ ఊరిస్తుంటే... కాలం వేడిపుట్టిస్తోంది. యేడాది దాటినా ఇంకా బెర్తులు నింపక.. పేర్లు కన్ఫమ్ కాక సీనియర్లంతా చతికిలబడుతుండగా, క్యాడర్ మౌనంగా రోదిస్తున్నారు. ఎన్నెన్నో ఖాళీలు పూరించిన ముఖ్యమంత్రి మంత్రివర్గ సీట్లను మాత్రం భర్తీ చేయకపోవడంపై అంతా ఉత్కంఠగా ఉన్న తరుణం రానే వచ్చింది అన్నట్టుగా ఎప్పటికప్పుడు ఉసురూమంటున్న సందర్భాలే.. తెలుగు కొత్త యేడాదిలోనైనా కలలు నిజమై.. ఊహల లోకం నుంచి నిజ ప్రపంచంలోకి దిగుదామనుకుంటున్న వారి ఆత్రుతకు ఇప్పుడు పాజిటివ్ వైబ్స్ తోడవుతున్నాయి. తెలుగు సంవత్సారాది వేళ తప్పకుండా మంత్రి వర్గ విస్తరణ ఉండబోతోందని, ఈ మేరకు సంబంధీకులంతా 'రండి బాబూ... రండి.. హస్తినాకు వచ్చి మేం చెప్పబోయే సలహాలు., సూచనలు విని.. కూర్పుతో తిరిగి వెళ్లండి..' అన్నట్టుగా వస్తున్న వర్త మానాలు మంత్రివర్గపు కొలువు తీరే విషయాలకు బలం చేకూరుస్తున్నాయి. ఎవరికి కలిసొస్తుందో.. మరెవరికి ముచ్చెమటలు పుట్టిస్తా యోగానీ బహుషా ఈవారం పదిరోజుల్లో తేలే ఘడియలు మాత్రం రానున్నాయనేది మాత్రం సుస్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఆయా జిల్లాల్లోని వివిధ సామాజికవర్గాల నేతలంతా రేసులో ఉన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రేమసాగర్ రావుతోపాటు ఎమ్మెల్యే వివేక్, వినోద్ పేర్లు సైతం వినిపిస్తుండగా తాజాగా ఎమ్మెల్సీ దండే విఠల్ పేరు తెరపైకి వచ్చింది.. ఇక ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్క ఎస్టీ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ మంత్రి పదవిపై నమ్మకంతో ఉన్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- ఉల్లిగడ్డలు, ఆలుగడ్డల సంచుల్లో పత్తి విత్తనాల ప్యాకెట్లు
- అటవీ ప్రాంతంలో విత్తనాలను మారుస్తుండగా చాకచక్యంగా పట్టుకున్న తాండూర్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్..



12

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో 2.47 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలను తాండూర్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్ వివరాలు వెల్లడించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మనోహర్ ఈ నెల 20న ఐచర్ వ్యాన్‌లో పల్లీల లోడును మధ్యప్రదేశ్‌లో దింపి తిరుగు ప్రయాణంలో నాగ్‌పూర్‌లో ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలతో పాటు 11 బ్యాగుల్లో 550 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను తాండూర్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. వీటి విలువ రూ. 6,17,500 వరకు ఉంటుందన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

- జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలి
- నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదానికి పిలుపునిచ్చారని నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు.




## బాధితులు బారులు.. తీరని బాధలు



## సీతక్కకు ధన్యవాదాలు

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



వివరాలు 12లో



2లో

## రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి

- అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు
- మొక్కజొన్న, మామిడి కాయలతో సభకు ఎమ్మెల్యేలు
- 'ఇథనాల్' ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి ■ మహేశ్వర్ రెడ్డి
- పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి ■ పాయల్ శంకర్
- నూతన మండలాల్లో భవనాలు ఏర్పాటు చేయండి ■ అనిల్ జాదవ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో గళమెత్తారు.. అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## బీజేపీ ఎమ్మెల్యేల డిమాండ్ - అసెంబ్లీ ఎదుట నిరసన











**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
ఇటీవల కురిసిన అకాల వర్షంతో అనేక మంది రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు. ఈ పరిస్థితిని ప్రభుత్వం తీసుకురావాలనే ప్రయత్నం చేస్తుంటే.. వారి మీదకు బాంబులు తీసుకొచ్చినట్లు అడ్డుపడుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని, పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అసెంబ్లీ ముందర నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్‌తో పాటు పాల్వాయి హరీష్ బాబు, వెంకట రమణారెడ్డి, ధనపాల్ సూర్యనారాయణ, రామారావు పటేల్ తదితరులు ఉన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం దుబారాలకు పోయిందని, సీఎంవోలో పని చేసే అధికారులు 200కి.మీ ప్రయాణానికి హెలికాప్టర్ ప్రయాణాలు చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం చేశారని పాయల్ శంకర్ విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ మాట తప్పితే కాంగ్రెస్ అమలు చేస్తుందేమో అనిభావించామని కానీ కేవలం రూ.20 వేల కోట్ల ఋణ మాఫీ మాత్రమే చేసిన కాంగ్రెస్ చేతులు దులుపుకున్నదని, అర్హత ఉన్నా అనేకమంది రైతులకు పంట ఋణాలు మాఫీ కాలేదన్నారు. ఇది ఇలా ఉంటే శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమరం భీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే స్పందించారు. అసెంబ్లీ సమావేశంలో ఆదిలాబాద్ పట్టణంలో కొమురం భీం కాలనీలో నివ సిస్తున్న టువంటి ఆదివాసీలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని, కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

---

### పంట నష్టపోయిన రైతులకు

# నష్టపరిహారం ఇవ్వండి

## అసెంబ్లీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఇచ్చోడ, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
అసెంబ్లీ జీరో హావర్స్‌లో బోథ్ నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. బోథ్‌లో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, ప్రధాన రోడ్లకు అటవీ అనుమతులు ఇవ్వాలని సోమవారం కోరారు. కొత్తగా ఏర్పడిన భీంపూర్, సోనాల, సిరికొండ మండలాలకు పక్క ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మంజూరు చేయాలన్నారు. వడగండ్ల వానతో నష్టపోయిన పంటలకే కాకుండా భూగర్భ జలాలు ఎండిపోయి నష్టపోయిన పంట రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అదే విధంగా బోథ్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, ఎండకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటి కోసం కిలోమీటర్ల కొద్ది నడిచి వ్యవసాయ బావుల వద్ద నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారని అన్నారు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

---

# పోడు భూముల సమస్యను పరిష్కరించండి

## అమాయక రైతులను వేధిస్తున్న అటవీశాఖ అధికారులు - అసెంబ్లీలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు





**కాగజ్‌నగర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీలో మాట్లాడారు..ఎండాకాలం వచ్చిందంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోడు భూముల రైతుల్లో భయాందోళన మొదలవుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గత 50 సంవత్సరాల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, అటవీ అధికారులు ఊర్ల మీద పడి పోడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పుడు పత్తి కట్టే తీసే సమయానికి ఫారెస్ట్ అధికారులు కందకాలు తవ్వుతున్నారని, దీని వలన పోడు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత 10 సంవత్సరాలు చాలా ఇబ్బందులకు గురై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించితే మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే ఒరవడిని కొనసాగిస్తుందన్నారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల మధ్యల జాయింట్ సర్వే నిర్వహించక, మా భూములు అంటే మా భూములు అని లాక్కుంటున్నారని అన్నారు. పోలీసులు మరచిపోయిన థర్డ్ డిగ్రీని ఫారెస్ట్ అధికారులు పోడు రైతులపై ఉపయోగించడం దారుణమన్నారు. వందలాది టేకు చెట్లను స్మగ్లర్లు నరికి తీసుకెళ్తుంటే కనీసం వారి మీద చర్యలు తీసుకోవడం లేదన్నారు. పోడు రైతులను ఇంతగా ఇబ్బందులకు గురి చేస్తుంటే సీనియర్ ఫారెస్ట్ అధికారులు కనీసం మందలించని పాపాన పోలేదని, సీనియర్ ఫారెస్ట్ అధికారులు హైదరాబాద్‌లో ఉంటూ ఫీల్డ్‌కు పోవడం లేదన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కర్జెల్లి రేంజ్ లో 600 టేకు చెట్లు నరికితే డీఎఫ్ఒ, పిసిసిఎఫ్‌లకు ఫిర్యాదు చేస్తే ఒక్కరి మీద యాక్షన్ తీసుకున్న పాపాన పోలేదన్నారు. గతంలో వేసిన బీటీ రోడ్డుకు ఇప్పుడు రినవల్ చేద్దామంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారు. సీసీ రోడ్లు వేయనియకుండా అడ్డుకుంటున్నారని మంత్రి పోడు భూములకు హామీ ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు.

---

# సోనారి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

**కుభీర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
సోనారి విద్యుత్ సబ్ స్టేషన్‌లో గ్రామస్థులు సింగిల్ ఫేస్ కరెంట్ నిరంతరం సరఫరా చేయాలని కోరుతూ ఆదివారం ఆందోళనలు చేపట్టారు. స్పందించిన జిల్లా అధికారి సూపరింటెండెంట్ ఇంజినీర్ సుదర్శనం, భైంసా సబ్ డివిజన్ విద్యుత్ శాఖ అధికారులు కుబీర్ ఏఈ ఆదిత్యతో కలిసి సోమవారం గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్థులతో చర్చించి సింగిల్ ఫేస్ కరెంట్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.



---

# క్షయ వ్యాధి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు

## కలెక్టర్ కుమార్ దీపక్ - క్షయ వ్యాధి నివారణలో సేవలు అందించిన వారికి ప్రసంశా పత్రాల అందజేసిన కలెక్టర్





**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా॥హరీష్ రాజ్, జిల్లా సంక్షేమాధికారి రౌఫఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం 'అవును మనం టి.బి.ని అంతం చేద్దాం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, క్షయ వ్యాధికి కారణమయ్యే మైక్రో బ్యాక్టీరియా ట్యుబర్కోసిస్‌ను ఈ రోజున కనుగొనడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 5 ట్రీట్మెంట్ యూనిట్లను మంచిర్యాల, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి, చెన్నూర్లలో ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో ఇప్పటి వరకు 1 వేయి 278 కేసులను గుర్తించి 871 మందికి మందులు పంపిణీ చేయడం జరుగుతుందని, క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నెల 1000 రూపాయల చొప్పున పౌష్టికాహారం కోసం నిక్షయ్ పోషణ్ యోజన క్రింద ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 671 మందికి సదుపాయం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి టి.బి. ముక్త్ భారత్ పథకంలో భాగంగా జిల్లాలోని 7 టి.బి. ముక్త్ గ్రామపంచాయతీలను నిర్ణయించడం జరిగిందని, ఇందులో చెన్నూర్ మండలం పొక్కూర్, కాసిపేట మండలం పల్లంగూడ, వేమనపల్లి మండలం సుంపుటం, జైపూర్ మండలం నర్వ, హాజీపూర్ మండలం పడనపల్లి, భీమిని మండలం వీగాం, జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామపంచాయతీలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 10 మంది టి.బి. వ్యాధిగ్రస్తులకు హిందూ సేవక్ సమాజ్-మంచిర్యాల, పెన్నిధి వాలంటరీ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పౌష్టికాహర కిట్లను అందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో క్షయ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని, వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, తరువాత సకాలంలో మందులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం క్షయవ్యాధి నిర్మూలనపై అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. క్షయ వ్యాధి నివారణలో ఉత్తమ సేవలు అందించిన 22 మంది వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ.లు భీష్మ, శ్రీధర్, ప్రోగ్రామ్ అధికారి సుధాకర్నాయక్, ఉప జిల్లా వైద్యాధికారి డా॥ఎస్.అనిత, డా॥సీతారామరాజు, డా॥ప్రసాద్, డా॥కోటేశ్వర్ రావు, డా॥అనిల్, డా॥హరిశ్చంద్రారెడ్డి, టి.బి. సమన్వయకర్త సురేందర్, డి.పి.ఓ. ప్రశాంతి, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

## సంబంధిత అధికారులు అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలి - కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదులలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీ దారుల నుంచి కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సమస్యల పై అర్జీలను కలెక్టర్‌కు అర్జీదారులు విన్నవించారు. అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా వింటూ పరిష్కార దిశగా సంబంధిత అధికారులు సమస్యల పై స్పందిస్తూ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కారమయ్యేది, కానిది తెలియజేయాలని, కార్యాలయాల చుట్టూ తిరగకుండా అర్జీదారుని సమస్యపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు వచ్చాయని, శాఖల అధికారులకు అందిస్తూ దరఖాస్తు దారుని సమస్యను బట్టి తక్షణమే పరిష్కరించాలని ఆన్నారు. ఈ గ్రీవెన్స్‌లో రెవెన్యు డివిజనల్ అధికారి వినోద్‌కుమార్, అధికారుల పాల్గొన్నారు.



## రెండు ఆలయాల్లో చోరీ



**ఇచ్చోడ, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
మండలంలోని పెద్దార్లగుట్టలో హనుమాన్ ఆలయం, వాగు వద్ద గల అయ్యప్ప సన్నిధానంలో చోరీ జరిగింది. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం స్థానికుడు.. అయ్యప్ప సన్నిధానానికి వెళ్లగా తలుపుల తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందరగా ఉంది. అలాగే హనుమాన్ ఆలయం తాళం పగులగొట్టి ఉండడాన్ని భక్తుడు గమనించాడు. హుండీని పగులగొట్టి ఉండడంతో స్థానికులకు సమాచారం అందించాడు. అందులో నగదు ఎత్తుకెళ్లారని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని పట్నాపూర్కు చెందిన మడావి కార్తీక్ చోరీ చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఐదు గంటల్లోనే దొంగను పట్టుకున్న ఎస్సై, పోలీసు సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

## దాడికేసులో ముగ్గురి రిమాండ్

**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
దాడి కేసులో ముగ్గురిని సోమవారం రిమాండుకు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పలువురు కార్మికులపై కొందరు దాడిచేశారు. కార్మికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి భగత్ సింగ్ కాలనీకి చెందిన రాజు, సమీర్, అర్ బాస్‌ను అరెస్ట్ చేశారు.

# కడెంలో రెండు గంటల పాటు దంచి కొట్టిన వాన

## వరి, పసుపు, మొక్కజొన్న పంటకు నష్టం

**కడెం, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
కడెం మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఈ వర్షంతో పాటు వడగండ్లు పడడంతో పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, పసుపు పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొన్నారు. దాదాపు రెండు గంటల పాటు నిరంతరాయంగా కురిసిన వర్షం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మొక్కజొన్న, వరి పంటలు నెలకొరిగినట్లు, మామిడి



కాయలు రాలి ఆపార నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా కురిసిన వర్షం కారణంగా రోడ్లు జలమయమయ్యాయి.

# టెన్త్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి



**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల ఆక్స్ఫర్డ్, సింగరేణి ఉన్నత పాఠశాలలు, తీగలపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్.టి.సి. బస్సులు, ప్రశ్నా, జవాబు పత్రాల రవాణా, బందోబస్తు, పారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ కొరకు 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 3వ రోజు ఆంగ్ల పరీక్షకు 9 వేల 177 మంది హాజరు కావలసి ఉండగా 9 వేల 156 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని, గతంలో అనుత్తీర్ణులైన వారు 31 మంది హాజరు కావలసి ఉండగా 24 హాజరయ్యారని, మొత్తంగా 99.70 శాతం హాజరు నమోదు కావడం జరిగిందన్నారు.

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై

## బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



**చెన్నూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత, అసత్య ఆరోపణలు చేసిన కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వాల శ్రీనివాస్ రావ్ మాట్లాడుతూ బండి సంజయ్ కేంద్ర కాబినెట్‌లో ఉండి కూడా అబద్దాలు, అసత్యాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి కొట్లాడిన కేసీఆర్‌పైన తన హోదాను మరిచి బండి సంజయ్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ సాంబాగౌడ్, డైరెక్టర్ మనిశెట్టి మల్లయ్య, మండల యూత్ అధ్యక్షులు మారిశెట్టి విద్యాసాగర్, నాయకులు నారాయణ, తిరుపతి రావ్, అక్కల మధుకర్, చందు, రాళ్లబండి స్వామి, కామ శ్రీనివాస్, కుమార్, అజ్మీరా పున్నం మారపాక పోచం, గోనె మోహన్ రెడ్డి భూమయ్య, సందీప్ రెడ్డి, హైమద్, మండలసోషల్ మీడియా కన్వీనర్ ఆసంపెల్లి సంపత్ కుమార్, బాపు నాయక్, ఇందూరి మహేష్, కామెర పవన్, కొత్రంగి మల్లేష్, అజయ్,తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరులో...**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్ చార్జి డాక్టర్ రాజా రమేశ్ హెచ్చరించారు. కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అనుచిత ఆరోపణలు చేసిన సంజయ్ పై కేసు నమోదు చేయాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులతో కలిసి సోమవారం చెన్నూర్ పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు.



# ప్రజలకు మెరుగైన సేవలందించాలి

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్సై, సీఐ, డీఎస్పీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసేచీలు, పోలీసులు ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపర్చుకోవాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. కోర్టు మానిటరింగ్ పద్ధతులను సమీక్షించి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. సిబ్బందికి వీక్లీ ఆఫ్ వచ్చే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలని తెలిపారు. అధికారులు సిబ్బందికి ఏవైన సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ఎస్సైలు, సీఐలు తమ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, మూఢనమ్మకాలు, డయల్ 100 గురించి అవగాహన కల్పించాలన్నారు. షీటీమ్ బృందం ప్రతీ గ్రామాన్ని సందర్శించారు. అంతకుముందు సీసీ టీవీలకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. వ్యభిచారం, గంజాయి, మట్కా, పేకాట, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీలు శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, సీఐలు, ఎస్సైలు, ఎచీలు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ లేకుండా పోయింది






హైదరాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం) రెండు రోజుల క్రితం నడుస్తున్న ఎంఎంటీఎస్ రైల్లో దాడికి గురై చికిత్స పొందుతున్న 22 ఏళ్ల అమ్మాయిని బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీష్ బాబు, పాయల్ శంకర్, రామారావు పటేల్ సోమవారం యశోద ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకు ఆఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా హోం శాఖ మంత్రిని నియమించలేదని, పోలీస్ శాఖలో పర్యవేక్షణ లోపించి నేరాల సంఖ్య పెరుగుతుందని విమర్శించారు. రాష్ట్ర రాజధానిలోనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటే మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉటుందో ప్రభుత్వ పెద్దలకు అర్థం కావడం లేదన్నారు. ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి బీజేపీ తరపున అన్ని రకాలు తాము అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించండి



ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం) ఆదిలాబాద్‌లోని నిశాన్ఘాట్, సర్వే నంబర్ 170 కాలనీల్లో కరెంట్ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మౌలిక వసతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రాములు ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డీఎం



నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం) నిర్మల్ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పండరి సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్టీసీ సంస్థ పనితీరు గురించి ఆమెకు వివరించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల నిరసన




నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం) అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ నాయకుడు విలాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, 1వతేదీన జీతాలు చెల్లించాలన్నారు. సమ్మెకాలాపై పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు.

## 10 పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు



నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం) నిర్మల్ జిల్లాలో సోమవారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,100 మంది విద్యార్థులకు గాను 9,089 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

## ప్రతీ ఒక్కరు సేవా గుణం అలవర్చుకోవాలి



కౌటాల, మార్చి 24 (ప్రభాత సమాచారం) అనాథలుగా మారినా ఇద్దరు అక్కా చెల్లెళ్ళకు ఎస్ఆర్ఎస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో పోలీసులు మీకోసంలో భాగంగా వారికి ఇంటిని నిర్మించారు. సోమవారం జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు ఇంటిని ప్రారంభించారు. కౌటాల మండలం బోధంపల్లి గ్రామానికి చెందిన రామిల్ల లక్ష్మి, రామిళ్ళ శ్యామల అనే అక్కాచెల్లెళ్ళు తల్లిదండ్రుల మృతితో అనాథలు మారడంతో ప్రస్తుతం వాళ్ళు నివాసం ఉండడానికి ఇళ్లు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్ఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఇంటి నిర్మాణం కోసం దాతల సహకారం కోరుతూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో కౌటాల ఎస్ఐ మధుకర్ స్పందించారు. పోలీసులు మీ కోసంలో భాగంగా అనాథలైన ఇద్దరు అక్కా చెల్లెళ్ళకు యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ సహకారంతో మేమున్నామంటూ ముందుకు వచ్చారు. అనాథలైనా ఇద్దరు అక్కా చెల్లెళ్ళకు ఒక లక్ష అరవై నాలుగు వేల రూపాయల ఖర్చుతో వారు ఉండేందుకు ఇంటిని నిర్మించి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీతో పాటు డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు కాపాడటమే పోలీసుల ధ్యేయం

### రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా




కన్నెపల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం) గ్రామాల్లో శాంతి, భద్రతలను కాపాడటం పోలీసుల ముఖ్య లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం మండలంలోని కన్నెపల్లి పోలీస్ స్టేషన్ సందర్శించి పోలీస్ స్టేషన్‌లో పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదుల గురించి ఆరా తీశారు. అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతల గురించి పోలీస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన మావోయిస్టుల వివరాలు తెలిపే పోస్టర్లను పరిశీలించి వారి సమాచారం గురించి ఆరా తీశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు ఎస్ఐబి ఇన్స్పెక్టర్ కరుణాకర్ కన్నెపల్లి ఎస్సై గంగారం పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

**జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలి - నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు**




నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం) ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదానికి పిలుపునిచ్చారని నిర్మల్ డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు క్షమించరానివన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ఆశయాలకు తగ్గట్టు రాష్ట్రంలో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ఆమోదించిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలు హరిస్తుందని విమర్శించారు. పార్లమెంట్‌లో విపక్షాలను మాట్లాడనీయకుండా అణచివేయడం ప్రజాస్వామ్యానికి హాని కలిగించే అంశమన్నారు. మహాత్మాగాంధీ గౌరవాన్ని తగ్గించేలా పలు పార్టీలు చేస్తున్న కార్యక్రమాలను ఎండగట్టాలన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తారు మారు చేయాలని చూస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్పేలా కార్యకర్తలు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పకడ్బందీ చర్యలు

నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం) నిర్మల్ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికబద్ధమైన రీతిలో ముందుకెళ్తున్నామని అదనపు ఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన కూడలిలో ఆయన ట్రాఫిక్ నియంత్రణ పట్ల తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. ముఖ్య కూడలిలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు సంచార చెరువు వ్యాపారుల వలన కలుగుతున్న ఇబ్బందులను వ్యక్తి గతంగా అడిగి తెలుసుకున్నారు.





### అర్జీదారులను ఇబ్బంది పెట్టకుంట

# సమస్యలను త్వరగా పరిష్కరించాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ - టెలిఫోన్ ప్రజావాణి అర్జీలను స్వీకరించిన కలెక్టర్**

**నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా అధికారులందరూ సమయానికి ప్రజావాణికి హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ప్రత్యేక అధికారులు తనిఖీలు చేయాలని, ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ, నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**టెలిఫోన్ ప్రజావాణి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్..**

అధిక ఉష్ణోగ్రతల కారణంగా, జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, వాటిని నమోదు చేసుకొని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారం కొరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 8 మంది దరఖాస్తుదారులు వివిధ ప్రాంతాలనుండి తమ అర్జీలను సమర్పించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి. ప్రజావాణిలో సమస్య నమోదుకు



సంబంధించి రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సప్ ద్వారా అందించారు. దూరప్రాంత ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు పలువురు టెలిఫోన్ ప్రజావాణి అర్జీ దారులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

**కాగజ్‌నగర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వారి ఆధర్వంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షల్లో ఎంపికైన కృటరక్ట్ పేషంట్లను సొసైటీ ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి సోమవారం 8 మందికి ఆపరేషన్ కోసం నేడు బెల్లం పల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించిన డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా.కొత్తపల్లి అనితలు అనంతరం డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలలో వేల మందికి ఆపరేషన్ చేయించామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆపరేషన్ చేయించికొని లబ్ధి పొందిన వారు మరి కొంతమందినీ ప్రోత్సహించాలని కోరారు. సామాజిక సేవ చేయాలనే ధృక్పథంతో తాము ప్రతీ మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా.కొత్తపల్లి అనితలు తెలిపారు. కార్యక్రమంలో గోపి కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# మంచిర్యాలలో పీఎస్‌టీ టాక్స్

**మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

భారతదేశంలో జీఎస్టీ టాక్స్ నడు స్తుంటే మంచిర్యాలలో పీఎస్టీ (ప్రేమ్‌సాగర్‌రావు టాక్స్) నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంచిర్యాల వసూలు మంచిర్యాలగా మారినందుకు బాధగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఇష్టం వచ్చినట్లు వసూళ్లకు పాల్పడుతున్నాడన్నారు. కలెక్టర్ కార్యాలయం 2023లో కూలగొట్టిన ఇండ్లను ప్రస్తుతం మళ్లీ కడుతున్నారని, అక్కడ కోట్లాది రూపాయలు వసూలు చేశాడన్నారు. మంచిర్యాలలోని వ్యాపారస్తుల వద్ద దాదాపు రూ.40 లక్షలకు వసూలు చేశారన్నారు. లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ల



దగ్గర కోట్లాది రూపాయలు వసూలు చేసిన ఎమ్మెల్యే విచ్చలవిడి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ, ప్రైవేటు భూములు, బెల్లంపల్లి చౌరస్తా ప్రైవేటు భూములు, ఉమర్ మియా సొసైటీ లేఅవుట్ పర్కు స్థలంలో కానీ, తిలక్‌నగర్ ప్రభుత్వ భూ మిలో కానీ, నస్పూర్ మున్సిపాలిటీలో కానీ ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు కట్టినా, భూములను కొనుగోలు చేసినా 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా వీటిని కూలగొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### గంజాయి విక్రయిస్తున్న

## యువకుల అరెస్టు

**బెల్లంపల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి కేంద్రంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. సోమవారం వన్‌టౌన్ ఎస్ ఏహెచ్ ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం... కన్నాల బస్తీ వద్ద కొందరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో వన్టెన్ సాచో దేవయ్య, పోలీసు సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల్లో ఎండీ. తాజ్ బాబా(హన్మాన్ బస్తీ-బెల్లంపల్లి), షేక్ ఇర్ఫాన్ బాబా (షంషీర్ నగర్-బెల్లంపల్లి), వాసాల గిల్ క్రిస్ట్ (రాజీవ్ నగర్-తాండూర్), మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతం నుంచి వలస వచ్చిన సంతోష్ సాహ్మడ్ జాదవ్(కాల్టెక్స్ ఏరియా) ఉన్నారు. వీరి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు. గంజాయి, తాగుడుకు బానిసగా మారి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకు వచ్చి విక్రయిస్తున్నారని తెలిపారు.






# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిస కావొద్దు

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు**

**కౌటాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో పోలీసులు మీకోసం భాగంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమ్ యాప్ లకు అలవాటు పడి అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అక్రమ బెట్టింగ్ యాప్‌లలో బెట్టింగ్‌కి పాల్పడిన, ఆన్లైన్ గేమింగ్ యాప్‌లో గేమ్స్ ఆడిన ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు అన్నారు. బెట్టింగ్ యాప్‌లు చాలా ప్రమాదకరమని వీటిలో ఒకసారి చిక్కుకుంటే బయటకు రావడం కష్టమవుతుందని, యాప్ నిర్వాహకుల నుంచి బెదిరింపులు వస్తాయని అన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత విద్యార్థులు బెట్టింగ్ యాప్స్ గివింగ్ యాప్స్‌కి బానిసలుగా మారి అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకొని విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారనిఅన్నారు. సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువతలో దీని వ్యసనం పెరుగుతుందని వీటికి కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని ఎస్పీ అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లో బెట్టింగ్ కు పాల్పడిన ఆన్లైన్ గివింగ్ యాప్‌లో గేమ్స్ ఆడిన, ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవన్నారు. ఇటువంటి కార్యకలాపాలపై వెంటనే డయల్ 100కు, స్థానిక పోలీస్ వారికి



సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సబ్ డివిజనల్ ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్, కౌటాల సీఐ ముత్యం రమేష్, కౌటాల ఎస్సై మధుకర్, ఎస్సైలు నరేష్, ప్రవీణ్, కొమురయ్య, రాజు, సందీప్, మహేందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విస్తరణపై గంపెడాశలు

- ఉగాదికి మంత్రివర్గ విస్తరణ ■ ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్ ■ ఢిల్లీకి పార్టీ పెద్దలు
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..
- కేబినెట్‌లో చోటు దక్కించుకునేందుకు ఉమ్మడి జిల్లా నేతల ముమ్మర ప్రయత్నాలు
- ఈ ముగ్గురిలో ఒకరికి ఖాయమంటున్న పార్టీ పెద్దలు ■ తెరపైకి ఎమ్మెల్సీ దండే విఠల్ పేరు
- హస్తంలో మొదలైన అంతర్మథనం..? ■ ఎస్టీ కోటాలో మంత్రి పదవిపై వెడ్మ బొజ్జు నమ్మకం

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి



ఆశ ఊరిస్తుంటే... కాలం వేడిపుట్టిస్తోంది. యేడాది దాటినా ఇంకా బెర్త్‌లు నింపక.. పేర్లు కన్ఫమ్ కాక సీనియర్లంతా చతికిలబడుతుండగా, క్యాడర్ మౌనంగా రోదిస్తున్నారు. ఎన్నెన్నో ఖాళీలు పూరించిన ముఖ్యమంత్రి మంత్రివర్గ సీట్లను మాత్రం భర్తీ చేయకపోవడంపై అంతా ఉత్కంఠగా ఉన్న తరుణం రానే వచ్చింది అన్నట్టుగా ఎప్పటికప్పుడు ఉసురూమంటున్న సందర్భాలే.. తెలుగు కొత్త యేడాదిలోనైనా కలలు నిజమై.. ఊహల లోకం నుంచి నిజ ప్రపంచంలోకి దిగుదామనుకుంటున్న వారి ఆత్రుతకు ఇప్పుడు పాజిటివ్ వైబ్స్ తోడవుతున్నాయి. తెలుగు సంవత్సారాది వేళ తప్పకుండా మంత్రి వర్గ విస్తరణ ఉండబోతోందని, ఈ మేరకు సంబంధీకులంతా 'రండి బాబూ... రండి.. హస్తినాకు వచ్చి మేం చెప్పబోయే సలహాలు., సూచనలు విని.. కూర్పుతో తిరిగి వెళ్లండి..' అన్నట్టుగా వస్తున్న వర్తమానాలు మంత్రివర్గపు కొలువు తీరే విషయాలకు బలం చేకూరుస్తున్నాయి. ఎవరికి కలిసొస్తుందో.. మరెవరికి ముచ్చెమటలు పుట్టిస్తా యోగానీ బహుషా ఈవారం పదిరోజుల్లో తేలే ఘడియలు మాత్రం రానున్నాయనేది మాత్రం సుస్పష్టంగా తెలుస్తోంది. దీంతో ఆయా జిల్లాల్లోని వివిధ సామాజికవర్గాల నేతలంతా రేసులో ఉన్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రేమసాగర్ రావుతోపాటు ఎమ్మెల్యే వివేక్, వినోద్ పేర్లు సైతం వినిపిస్తుండగా తాజాగా ఎమ్మెల్సీ దండే విఠల్ పేరు తెరపైకి వచ్చింది.. ఇక ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్క ఎస్టీ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ మంత్రి పదవిపై నమ్మకంతో ఉన్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

రాష్ట్రంలో పదవుల కోసం వేచి చూస్తున్న కాంగ్రెస్ నేతల కలలు ఫలించే సమయం ఆసన్నమైందనే చర్చ జోరుగా సాగుతోంది. ఏడాదిగా వాయిదా పడుతూ వస్తున్న కెబినెట్ విస్తరణ ఉగాది నాటికి పూర్తికానుందనే వార్తలు గుప్పుమంటున్నాయి. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డితో పాటు సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. హైకమాండ్ పిలుపు మేరకు వారు ఢిల్లీ వెళ్లడంతో పదవుల పంపకం కోసం రంగం సిద్ధమైందనే ఆశ ఆశావహుల్లో నెలకొంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఇంకా ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ స్పీకర్ సహా పలు కేబినెట్ ర్యాంక్ హోదా గల కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఎదురుచూస్తున్నాయి. వాటిని భర్తీ చేయాలని.. వాటిలో తమకు అవకాశాలు కల్పించాలని చాలా మంది నేతలు ఎదురు చూస్తున్నారు.

**భారీగా పోటీ..**

సీఎం రేవంత్ రెడ్డి కెబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉంది. మంత్రి పదవి కోసం భారీగా ఆశావహులు ఎదురుచూస్తున్నారు. సామాజిక సమీకరణాలు.. జిల్లాల ప్రయత్నాలు ఇలా అన్ని సమీకరణాలు చూసుకుని పదవులు భర్తీ చేసేందుకు పార్టీ పెద్దలు సిద్ధ మయ్యారు. ఇలా చేస్తే చాలా మంది అసంతృప్తికి గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముందు పదవులు రాని వారిని బుజ్జగించి ప్రత్యామ్నాయ పదవులను ఇచ్చేలా ఒప్పించి.. పదవుల భర్తీ చేపట్టనున్నట్లుగా తెలుస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే హైకమాండ్‌తో రేవంత్ రెడ్డి, భట్టి చర్చించినట్లుగా సమాచారం.

**నటరాజన్ నివేదిక మేరకు..?**

ఇటీవల మీనాక్షి నటరాజన్ వచ్చారు. ఆమె పూర్తిగా పరిస్థితుల్ని అధ్యయనం చేసి.. హైకమాండ్‌కు నివేదిక ఇచ్చినట్లుగా తెలుస్తోంది. పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు వస్తాయని ఆమె స్పష్టం చేశారు. సుదీర్ఘంగా పార్టీలో ఉన్న వారికి.. ఎన్నికల ముందు పార్టీలో చేరిన వారికి.. గెలిచిన తర్వాత పార్టీలో చేరిన వారికి అనే వర్గాల్లో విభజించి అత్యధిక ప్రాధాన్యత సుదీర్ఘంగా పార్టీలో ఉన్న వారికి ఇవ్వాలను కుంటున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు మీనాక్షి నటరాజన్ ఇచ్చిన నివేదిక మేరకు పదవులు ఎవరెవరికి ఇవ్వాలో ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది.

**ఉగాది రోజే ...**

రేవంత్ కేబినెట్‌లో ఆరుగురికి మంత్రి పదవులు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. మార్చి 30వ తేదీ ఉగాది. ఈ పండగ నాటికి కేబినెట్ కూర్పును పూర్తి చేయాలనే లక్ష్యంతో పార్టీ అధిష్టానం కృతనిశ్చయంతో ఉందని సమాచారం. ఆ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలను ఢిల్లీకి పిలిపించారనే చర్చ సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్‌తో భేటీ అనంతరం వీరంతా సోమవారం రాత్రి ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి కొత్త ఇంచార్జ్‌గా నియమితులైన మీనాక్షి నటరాజన్‌తో కలిసి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. వివిధ సామాజికవర్గాల నేతలంతా రేసులో ఉన్నారు. ఇక నిజామాబాద్ జిల్లాలో సుదర్శన్ రెడ్డితోపాటు పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ప్రేమసాగర్ రావుతోపాటు ఎమ్మెల్యే వివేక్, వినోద్ పేర్లు సైతం వినిపిస్తుండగా తాజాగా ఎమ్మెల్సీ దండే విఠల్ పేరు తెరపైకి వచ్చింది.. ఇక ఉమ్మడి జిల్లా నుంచి ఒకే ఒక్క ఎస్టీ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ మంత్రి పదవిపై నమ్మకంతో ఉన్నారు. ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

---

### రూ.26.25లక్షలు

## పలికిన తైబజార్

**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

పట్టణ తైబజార్ వేలం ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం సమకూరింది. పట్టణానికి చెందిన మీర్జా అమీన్బేగ్, సయ్యద్ ఇస్రార్, కాళ్ల సాయికృష్ణలు దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో కమిషనర్ సీవీఎన్. రాజు అధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఇస్రార్ గైర్హాజరు కాగా మిగతా ఇద్దరు హాజరయ్యారు. ఇందులో అధికంగా రూ.26.25 లక్షలకు మీర్జా అమీన్బేగ్ తైబజార్ను దక్కించుకున్నారు. గతేడాది రూ.20.69 లక్షలకు వేలం వేయగా, ఈసారి బల్దియాకు రూ.5.56లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. సదరు వ్యక్తికి ఏడాదిపాటు తైబజార్ నిర్వహించుకునే అవకాశముంటుంది. బల్దియా ఉద్యోగులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



**ముథోల్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

బాసర ఆలయానికి వెళ్లే మూల మలుపు రెండో ఆర్చి గేట్ వద్ద సోమవారం ప్రమాదం జరిగింది. సరస్వతీ ఆలయం నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో బాసర విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ ప్రమోద్ డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై గణేశ్ పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

**ఖానాపూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

అంబేద్కర్‌నగర్ - దిలావార్పూర్ మార్గంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఖానాపూర్‌కు చెందిన మజహర్ సరైన ధ్రువ పత్రాలు, హెల్మెట్ లేకుండా వెళ్తుండగా సుధీర్ అతడిని ఆపి తనిఖీ చేసి ఫొటోలు తీశారన్నారు. మజహర్ పోలీసులు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. సుధీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## 'పది'లో కాపీయింగ్ విద్యార్థి డిబార్

**నిర్మల్ :** భైంసాలోని బాలికల ఉన్నత పాఠశాలలో కాపీయింగ్ పాల్పడుతున్న ఓ విద్యార్థినిని రాష్ట్ర పరిశీలకుడు టి.శ్రీనివాస్ డిబార్ చేశారు. లోకేశ్వరం మండలకేంద్రంలోని ఉన్నతపాఠశాల చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్) నర్సింహులచార్యులు విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు డీఈవో రామారావు మెమో జారీ చేశారు.

### కుల బహిష్కరణ కేసులో

## ఆరుగురికి జైలు శిక్ష

**ఇచ్చోడ, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

కుల బహిష్కరణ కేసులో ఆదిలాబాద్ స్పెషల్ జేఎఫ్సీఎం కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి ఆరుగురు నేరస్థులకు నెల రోజుల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించారు. లైసెన్ అధికారి పండరి తెలిపిన వివరాల మేరకు నేరడిగొండ మండలం వడూరుకు చెందిన ఎడన్నను ఆస్తి వివాదంలో కులపెద్దలు పంచాయితీ నిర్వహించి కులబహిష్కరణ చేశారు. బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఆదిలాబాద్ పట్టణంలో బైక్ చోరీకి

**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ద్వారకానగర్‌లో ఆదివారం రాత్రి బైక్ చోరీకి గురైంది. నేరడిగొండ మండలంలోని వాగ్దారికి చెందిన సోయం వెంకటేశ్ అద్దెకు ఉంటున్నాడు. ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేసిన ఆయన ఉదయం చూసే సరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా కనిపించలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# టీబీ రహిత సమాజానికి కృషిచేయాలి



ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
టీబీ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆడిటో రియంలో ప్రపంచ టీబీ దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య విద్యార్థులకు టీబీ వ్యాప్తి, ప్రభుత్వం తీసుకుంటున్న నివారణ చర్యలు, చికిత్స విధానాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. మెడికోలకు రంగోలి, పెయింటింగ్, పాటల పోటీలు నిర్వ హించారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసపత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 2030 నాట కి దేశంలో టీబీని నివారించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముం దుకు సాగుతుందని తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో టీబీ ఎక్కువగా ఉందని, అవగాహన రాహిత్యంతోనే వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. టీబీపై వంద రోజుల అవగాహన కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే రిమ్స్ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, మెడికోలు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ మరమ్మతుల పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
కాగజ్‌నగర్ పట్టణంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఫారెస్ట్ కార్యాలయం, సర్సిల్క్ వార్డ్ నెం 3లో పడిపోయిన విద్యుత్ తీగలు, స్తంభాలను సవరిస్తున్నటు వంటి స్థలాలను సోమవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల పరిశీలించారు. త్వరితగతినా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కిరణ్, సంబంధిత విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి దినోత్సవం



ముథోల్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
ముథోల్‌లోని సామాజిక ఆసుపత్రిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా డా.రాహుల్, డా. మల్లి కార్జున్, డా. వెంకట్ సాయి సువర్ధన్ రాబర్ట్ కోచ్ చిత్రపటం ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే సిబ్బంది అందరి చేత వైద్యులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్వైజర్ లాలయ్య, హెడ్ నర్స్ పద్మా, కల్పన, ప్రేమలత, స్టాఫ్ నర్సులు భూలక్ష్మి, పద్మ, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదుల విభాగం



నర్సాపూర్ (జి), మార్చి 24 (ప్రభాత సమాచారం)
నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదు విభాగం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీని వాస్, డిటి వాహిద్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీఓ తిరు పతిరెడ్డి, ఐసీడీసీ సూపర్‌వైజర్ లక్ష్మి శారద, ఐకేపీ సీసీ ముత్యం, జూనియర్ అసిస్టెంట్ భోజన్న పాల్గొన్నారు.

## కవితా పోటీల్లో ప్రథమ బహుమతి

మందమర్రి, మార్చి 24 (ప్రభాత సమాచారం)
మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన కాపురపు రవికుమార్కు కవితా పోటీల్లో ప్రథమ స్థానం దక్కింది. బోయి భీమన్న జీవితం-సాహిత్యంపై నిర్వహించిన కవితా పోటీలో రవికుమార్ ప్రథమ స్థానం దక్కించుకు న్నారు. రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ భీమన్న సాహితీ నిధి ట్రస్ట్, కళావేదికలో భీమన్న సతీమణి హైమావతి, కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతా ప్ తదితరుల చేతుల మీదుగా రవికుమార్ బహుమతి అందుకున్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

### వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ముఖాడే ఉత్తం



ఇంద్రవెల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)
ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ యువతి, యువకులు ప్రతి ఒక్కరూ రాజీవ్ యువ వికాసం పథకానికి అప్లై చేసుకోవాలని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం అన్నారు. సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యువతకు ఆర్థిక చేయూతను అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు.

# సామాజిక సేవకు పురస్కారం

### సేవారత్న పురస్కారం అందుకున్న సత్యరాజ్ ఉపారప్



గుడిహత్నూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ స్థాపించి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మం డల వాసి సత్యరాజ్ ఉపారప్‌ను సేవా రత్న పురస్కారం వరిం చింది. సామాజిక సాహిత్య, సాంస్కృతిక, సేవాలి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన స్వర్ణ నంది సేవా రత్న పురస్కార ప్రదానోత్సవ కార్యక్ర మంలో రిటైర్డ్ హైకోర్టు జడ్జి తెలంగాణ రాష్ట్ర మానవ హ క్కుల కమిషన్ తొలి చైర్మన్ జస్టిస్ చంద్రయ్య అందించారు. వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి ఈ అవార్డులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా రెండేళ్ళ క్రితం రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ప్రారంభించి నాటి నుండి నేటి వరకు సామాజిక సేవలో నిమగ్నమై నిరు పేదలకు, విద్యార్థులకు, అవసరమైన వారికి సహాయం అందిస్తూ సా మాజిక సేవలో ముందుంటున్నారు. అనేక మంది విద్యార్థుల కు సరైన దిశ దిశలను నిర్దేశిస్తూ వారిని చైతన్య పరుచుటకు కృషి చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆయన అందించిన సామా జిక సేవా కార్యక్రమాలు విశేష కృషిని గుర్తించి వారు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. జాతీయ వినియోగదారుల మం డలి అధ్యక్షులు కృష్ణ రెడ్డి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో 'త్రినయన'

ముథోల్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
బాసర ట్రిపుల్ ఐటీలో త్రినయన సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే అనేక ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో జానపదాల పాటలు, నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళలు, సంగీతం, నృత్యం మాత్రమే కాకుండా, ఫ్యాషన్ ప్రదర్శన 'ఫ్యాషన్ ఫ్రెంజ్' ద్వారా విద్యార్థులు తమ సృజనాత్మకతతో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ 'త్రినయన' పేరిట జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు తమలోని కళా నైపుణ్యం ప్రదర్శించారన్నారు. ఈ ఉత్సవం విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏఓ రణధీరసాగి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కన్వీనర్లు డాక్టర్ రాములు, డాక్టర్ అజ య్, ప్రభాకర్రావు అసోసియేటెడ్, ఎ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిఘా నీడలో వెజిటేబుల్ మార్కెట్



బెల్లంపల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)
బెల్లంపల్లి పట్టణంలోని వెజిటేబుల్ మార్కెట్ ఇకపై నిఘా నీడలో ఉండనుందని మంచిర్యాల డీసీపీ భాస్కర్ తెలిపారు. కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలు సోమవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని బెల్లంపల్లిలోని ప్రతి అసోసియేషన్ వారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## గీతవాణి పుస్తకావిష్కరణ



ముథోల్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన ప్రముఖ కవి రచయిత మోటివేషన్ స్పీకర్ పోస్ట్ మాస్టర్ రెడ్డి బాలాజీ రాసిన మూడో పుస్తకం ఆవిష్కరణ డాక్టర్ నాగేశ్ డాక్టర్ రజినీకాంత్ బాజీరావు సోమవారం ప్రా రంభించారు. వినాయక్, అడ్వకేట్ వినాయక్ ప్రసాద్, ఉప్పు భోజన్న, వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)
ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నా రు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలా బాద్ డీఎస్పీ జీవన్ రెడ్డితో సోమవారం ట్రాఫిక్ అవగా హనతో కూడిన ఫ్లెక్సీలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రో డ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. పట్టణంలో సీసీ కెమెరాల ద్వారా నిబంధనలు ఉల్లం ఘిస్తే జరిమానా విధిస్తామన్నారు. ప్రధాన కూడళ్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పించడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్, సీహెచ్.నాగేందర్ పాల్గొన్నారు.




# వడదెబ్బ నుండి కాపాడుకోవాలి

■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
వేసవిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా గురయ్యే వడదెబ్బ నుండి కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో మంచిర్యాల ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రావు, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా॥ హరీష్ రాజ్, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి రవీందర్రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి లతో కలిసి వడదెబ్బ నివారణపై తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలు, వడదెబ్బకు గురైన వారిని రక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అనుబంధ శాఖల సిబ్బంది, ఐ.సి.డి.ఎస్. సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వారికి తీవ్రమైన శరీరక ఉష్ణోగ్రత, తల నొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక ఎండిపోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూత్రం పసుపు రంగులో ఉండి మంట రావడం, పాక్షికంగా పూర్తిగా రోగి అపస్మారక స్థితికి చేరుకోవడం జరుగుతుందని తెలిపారు. వడదెబ్బ తగలకుండా చల్లని నీడ ప్రదేశంలో ఉండాలని, ఉష్ణోగ్రత అతిగా ఉన్నప్పుడు గొడుగు ఉపయోగించాలని, తెల్లని వదులు దుస్తులు ధరించాలని, తలపై టోపీ, రుమాలు ధరించాలని, ఎండలో తేలికైన పనులు చేయాలని, ఉప్పు కలిపిన మజ్జిగ, నీరు తాగాలని, ఓ.ఆర్.ఎస్. సేవించాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తికి దుస్తులు వదులుగా ఉండేలా చేయాలని, ప్రాథమిక చికిత్స అందించి వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. ఎండలో తిరుగకూడదని, ముదురు రంగు, పాలిస్టర్, బిగుతు దుస్తులు ధరించకూడదని, మత్తు పానీయలు, కూల్డ్రింక్స్ సేవించకూడదని తెలిపారు. జిల్లాలో 74 వేల 350 ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు ఉన్నాయని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో, ఆశ కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 100 ఆయుష్మాన్ ఆరోగ్య ఉప కేంద్రాలు, 650 మంది ఆశా కార్యకర్తల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి మండలంలో, ఆరోగ్య కేంద్రంలో ఎపిడమిక్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, మండలాల వారిగా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో వైద్యాధికారి, ఎస్.ఐ., తహశిల్దార్ సభ్యులుగా ఉంటారని, వడదెబ్బ కేసుల వివరాలు, మరణాలను ధృవీకరిస్తారని తెలిపారు. జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్టేషన్లు, ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలలో, చౌకధరల దుకాణాలు, జిల్లాలో గుర్తించబడిన 40 ఇటుకబట్టీలు, నిర్మాణ ప్రాంతాలలో, సింగరేణి గనులలో ఓ.ఆర్.ఎస్. అందుబాటులో ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఎన్.సి.డి. నోడల్ అధికారిగా డా॥ ప్రసాద్‌ను నియమించడం జరిగిందని, రోజువారిగా ఉష్ణోగ్రతలను పరిశీలించి, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమలు, నిర్మాణ సంస్థల ప్రదేశాలలో వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించాలని, జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీలు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్లు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాలలో పని చేసే సమయాలపై కార్యచరణ రూపొందించి వడదెబ్బ నుండి కాపాడుకోవడంలో రైతులు, కూలీలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, ప్రధాన కూడళ్ళ వద్ద ఉష్ణోగ్రత తెలిసేలా ప్రదర్శించాలని, మిషన్ భగీరథ ద్వారా అంతరాయం లేకుండా ప్రజలకు త్రాగునీరు అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవిలో అటవీ, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అనంతరం వడదెబ్బ నివారణ సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారులు డా॥సుధాకర్నాయక్, డా॥ఎస్.అనిత, డా॥సీతారామరాజు, డా॥ అనిల్, ఎపిడమలిస్ట్ సుమన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జమిలి ఎన్నికలతో ఆర్థిక భారం తగ్గుతుంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్‌గౌడ్

**దండేపల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
వన్ నేషన్ వన్ ఎలక్షన్ జమిలి ఎన్నికలతో దేశానికి ఆర్థిక భారం తగ్గుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేష్‌గౌడ్ అన్నారు. దండేపల్లిలో పద్మశాలి సంఘం భవనంలో సోమవారం పార్టీ నాయకుల విసృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ బిల్లు వల్ల దేశ ప్రగతికి కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసు కెళ్లేందుకు కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిం చా లని కోరారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల నిర్వహించడం వల్ల ఓట ర్లకు సమయం వృథా కాదన్నారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్బంగా మండలశాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్ గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, మండల అద్యక్షుడు రాజయ్య, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కన్వీనర్ గుండ రవీందర్, మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్ పాల్గొన్నారు. లక్షెట్టిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని వైష్ణవి మహిళ డిగ్రీ కళాశాలలో నాయకులు సోమవారం జమిలి ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ దేశం అంతటా ఒకేసారి అన్ని రకా ల ఎన్నికలు జరిగితే కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాలలో వన్ నేషన్ వ న్ ఎలక్షన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రఘునాత్ వెరబెల్లి, ముఖేష్ గౌడ్, రమేష్ చంద్, పాల్గొన్నారు. కాసిపేటలో ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల ఆర్థిక వ్యవ స్థకు నష్టం జరగ కుండా ఉంటుం దని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల కృష్ణదేవరాయలు అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మో డల్ స్కూల్‌లో ఒకే దేశం ఒకే ఎన్నికపై నిర్వహించిన సదస్సుకు హాజరై మాట్లాడారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు





**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం ఊరు రామకృష్ణాపూర్‌కు చెందిన మెంగని శ్రీనివాస్ మందమర్రి శివారులో తనకు గల భూమిని కొందరు అక్రమంగా తనకు తెలియకుండా పట్టా చేయించుకున్నారని, ఈ విషయమై న్యాయస్థానంలో కేసు కొనసాగుతున్నందున ఇట్టి భూమిపై ఎలాంటి లావాదేవీలు, పట్టా మార్పులు జరగకుండా బ్లాక్ చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కత్తెరమల్ల లింగమూర్తి తన తాతల నుండి వస్తున్న పట్టా భూమిలో కొంత భాగాన్ని అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ అవ్వడం లేదని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన నాగపురి శంకర్ తనకు గల భూమి ధరణి ద్వారా ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా తప్పిదంగా నోటిఫై చేశారని, తాను ఎలాంటి అవార్డు అమౌంటు, ఇతర లాభం పొందలేదని, ఇట్టి భూమిని సవరించి పహాణి మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. భీమిని మండలం చిన్నగుడిపేట గ్రామానికి చెందిన పెసరి మల్లేష్ కుటుంబంలో పంపకాలు జరుగగా తనకు వచ్చిన వాటా భూమి వివరాలు తన పేరిట ఆన్లైన్లో నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామానికి చెందిన నల్లగొండ వెంకటి తన భూమి పాల్వాయి ప్రాజెక్టు 'సాలిగాం' ఎర్రవాగు లింకు కాలువలో కోల్పోయానని, ఇట్టి భూమికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమిని మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన పగిడి కవిత తాను గతంలో అంగన్వాడీ స్కూల్ టీచర్, ఆయాగా పని చేయడంతో పాటు ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రక్రియలో రిపోర్టులు రాశానని, తనకు ఉపాధి కల్పించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తెలంగాణ దివ్యాంగుల ఐక్యవేదిక ప్రతినిధి నగురారపు సుమన్ తన దరఖాస్తులో ప్రభుత్వం తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్లను ప్రతి దివ్యాంగుడికి కేటాయించాలని, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు అంత్యోదయ రేషన్ కార్డు జారీ చేయాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులు దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని, ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచాలని, సదరం శిబిరాలలో స్లాట్లను 100కు పెంచాలని కోరారు. భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ప్రతినిధి మాధవరపు వెంకటరమణరావు జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న, వరి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన దాసరి సృజన తనకు లక్కీడ్రాలో రెండు పడక గదుల ఇల్లు వచ్చిందని, సంవత్సరాలుగా కిరాయి ఉంటున్న తమకు ఇల్లు ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్

**మందమర్రి, మార్చి 24 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కేంద్రం చార్వాక సమావేశ ప్రాంగణంలో బహుజన్ సమాజ్ పార్టీ అసిఫాబాద్, మంచిర్యాల జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ కో-ఆర్డినేటర్ నిషాని రామ్ చందర్, జోనల్ కోఆ ర్డినేటర్ అడ్వకేట్ జగన్మోహన్ కాదాసీ రవీందర్ ఈసీ మెంబర్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావే శంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్‌ను నియమించారు. సెంట్రల్ కోఆర్డినేటర్ నిషాని రామ్ చందర్ మాట్లాడుతూ మంచిర్యాల అసిఫాబాద్ జిల్లాలో బూత్ స్థాయి నుండి పార్టీని పటిష్ట పరచాలని, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకు సాగాల న్నారు, బీఎస్పీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్ పేరుతో బీ సీ లను రేవంత్ రెడ్డి మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. బీసీల వాటా మేరకు ఎందుకు ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మండల్ కమిషన్‌ను తుంగలో తొక్కి బీసీ లకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా ముల్కల రాజేంద్ర ప్రసాద్ నియోజకవర్గ అధ్యక్షులుగా నారాయణ గౌడ్, చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా రాజు, ఆసిఫాబాద్ జిల్లా ఇంచార్జిగా తుకారాం, నియోజకవర్గ అధ్యక్షులుగా కిషన్ రావులను ఏకగ్రీవంగా నియమించారు. కృష్ణ,చైతన్య, బోనగిరి మహేష్, రాజబాబు, సుందిళ్ల అశోక్, ఎస్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# మన అవార్డులను లాగేసుకుంటున్నారు

**: దీపికా పదుకొణె**

మన దేశంలో ఎంతోమంది ప్రతిభ ఉన్న నటీనటులున్నారనీ, అయితే చాలాసార్లు మనకు రావలసిన అవార్డులను లాగేసుకున్నారని దీపికా పదుకొణె కామెంట్స్ చేశారు. ఈ మేరకు ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేశారు. అందులో ఆస్కార్ గురించి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని పంచుకున్నారు. ‘‘భారతదేశం సినీ చరిత్రలో ఎన్నో గొప్ప కథలు తెరకెక్కాయి. కానీ ఆ సినిమాలకు, ఆ కథలకు, నటీనటుల ప్రతిభకు ఏమాత్రం గుర్తింపు రాలేదు. ‘చాలాసార్లు మనకు రావాల్సిన ఆస్కార్‌లను లాగేసుకున్నారు. ‘ఆర్ఆర్ఆర్’లోని పాటకు ఆస్కార్ ప్రకటించినప్పుడు నేను ప్రేక్షకుల్లో కూర్చొని ఉన్నాను. ఆ సమయంలో ఎంతో భావోద్వేగానికి  గురయ్యాను. నిజానికి ఆ సినిమాతో నాకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఆ సినిమాలో భాగం కూడా కాదు. కేవలం ఒక భారతీయురాలిగా ఇది మన సినిమా అని ఆ క్షణంలో వ్యక్తిగతంగా ఎంతో ఆనందం కలిగింది. ఆ క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. ‘ది బ్రూటలిస్ట్’ చిత్రానికి గాను ఈ ఏడాది అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా ఆస్కార్ గెలిచినందుకు నేను సంతోషించాను’’ అని అన్నారు. 2023 ఆస్కార్ వేడుకలో ‘ఆర్ఆర్ఆర్’ చిత్రంలోని నాటునాటుని పాటనుఉ దీపిక ప్రేక్షకులకు పరిచయం చేశారు. ‘డు యూ నో నాటు?’ తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుంటారు. ‘ఆర్ఆర్ఆర్’ చిత్రం నుంచి ‘నాటు నాటు’ ఇదే..’ అంటూ దీపిక ఠఃఈ పాటను పరిచయం చేయడం విశేషం.



# ఆమె అందానికి హద్దులు లేవు

అందాల ముద్దుగుమ్మ బాలీవుడ్ నటి దిశా పటానీ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. లోఫర్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయం అయ్యింది ఈ చిన్నది. ఈ మూవీ తర్వాత ఈ ముద్దుగుమ్మకు అంతగా అవకాశాలు రాలేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ బ్యూటీ వరస సినమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. గ్లామర్ పాత్రలతో కుర్రకారును మాయ చేస్తుంది. అయితే తాజాగా ఈ అమ్మడు తన ఇన్ స్టాలో పలు ఫోటోలు పోస్టు చేసింది. అందులో ఐపీఎల్ ఓపెనింగ్ అంటూ షేర్ చేసిన ఈ ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. దిశా తాజాగా ఐపీఎల్ 2025 ఓపెనింగ్ సెరోమణిలో కనిపించి అందరినీ ఆకట్టుకుంది. క్రిస్టల్స్‌తో తయారు చేయించిన డ్రెస్‌లో తన అందాలను ఆరబోతస్తూ, డ్యాన్స్ పుర్పామెన్స్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. దీనికి సంబంధించిన ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతుండటంతో, దిశా పటాని అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. బ్యూటిఫుల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ అమ్మడు అభిమానులు.



# శ్రీలీలను డామినేట్ చేసిన కెతిక శర్మ..!

నితిన్ రాబిన్ హుడ్ సినిమాలో హీరోయిన్ శ్రీలీల అన్నారు కానీ నిన్న జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ చూస్తే అందరు కెతిక శర్మ అనుకోక తప్పదు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో వెంకీ కుడుముల డైరెక్షన్ లో తెరకెక్కిన రాబిన్ హుడ్ సినిమాలో నితిన్ హీరోగా నటించగా శ్రీలీల ఫిమేల్ లీడ్ గా నటించింది. సినిమాలో అది దాసర్ ప్రైజు సాంగ్‌లో కెతిక స్పెషల్ పర్ఫార్మెన్స్ చేసింది. ఈంధ్యనే రిలీజైన ఈ సాంగ్‌కు సూపర్ రెస్పాన్స్ వచ్చింది. రాబిన్ హుడ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో శ్రీలీల కన్నా కెతిక గ్లామర్ షో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేసింది. ఇద్దరు హీరోయిన్స్ సినిమాలో ఉంటే ఈవెంట్ లో ఇద్దరు పక్కపక్కనే ఉంటారు. కానీ రాబిన్ హుడ్ ఈవెంట్ లో శ్రీలీల ఒక పక్క, కెతిక శర్మ మరోపక్క నిలబడ్డారు. ఇక మైత్రి నిర్మాత రవి శంకర్ పుష్ప లో స్పెషల్ సాంగ్ ఉ అంటావా పాటకి ముందు కెతిక శర్మనే అనుకున్నామని చెప్పారు. ఆ సినిమాకు కుదరలేదు అందుకే రాబిన్ హుడ్ కి తీసుకున్నామని చెప్పారు. రాబిన్ హుడ్ సినిమాలో కెతిక శర్మ చేసిన అది దా సర్ ప్రైజు సాంగ్ ఇప్పటికే ట్రెండింగ్ లో ఉంది. సినిమాలో ఆ సాంగ్ ఎంత స్పెషల్‌గా ఉంటుంది అన్నది చూడాలి. ఏది ఏవైనా రాబిన్ హుడ్ ఈవెంట్‌లో గ్లామర్ మెరుపులతో కెతిక శర్మ ఆడియన్స్ మనసు కొల్లగొట్టిందని చెప్పడంలో సందేహం లేదు.

# ఉగ్రవాద కదలికలపై తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. రజనీకాంత్



సముద్రతీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు  అప్రమత్తంగా ఉండాలని సూపర్ స్టార్ రజనీకాంత్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొత్త వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా దేశంలోకి చొరబడే అవకాశం ఉందని.. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. మన దేశ కీర్తిని దెబ్బతీసేందుకు ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా చొరబడి విధ్వంసం సృష్టిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా 26/11 ముంబై ఉగ్రదాడి ఘటనను రజనీకాంత్ ఉదహరించారు. ఈ దాడి ఘటనలో సుమారు 175 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అందువల్ల సముద్ర తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై ప్రజల్లో అపగాహన కల్పించేందుకు 100 మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు పశ్చిమ బెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 7 వేల కిలోమీటర్ల సైకిల్ ప్రచార యాత్ర చేపట్టనున్నారని తెలిపారు. వారు మీ ప్రాంతాలకు వచ్చేటప్పుడు స్వాగతించాలని సూచించారు. కుదిరితే వారితో కొంచెం దూరం వెళ్లి వారికి సహకరించాలని కోరారు.

# వాళ్లకు లేని ప్రాబ్లమ్స్ మీకెందుకు..?



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సికందర్. ఈ సినిమాకు మురుగదాస్ దర్శకత్వం వహించారు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనుంది. ఈ మూవీ మార్చి 30న ఈద్ పండుగ కానుకగా థియేటర్లలోకి రానుంది. అయితే, ఈ సినిమాలో రష్మిక, సల్మాన్ మధ్య ఏజ్ గ్యాప్‌పై నెట్టింట తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఏజ్ గ్యాప్ వివాదంపై సల్మాన్ స్పందించారు. ఈ మేరకు విమర్శకులకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ‘నాకు, హీరోయిన్ రష్మికకు మధ్య దాదాపు 31 ఏళ్ల వయసు తేడా ఉందని కొందరు అంటున్నారు. ఏజ్ గ్యాప్ విషయంలో రష్మికకు ఎలాంటి ప్రాబ్లమ్ లేదు. ఆమె తండ్రికి కూడా సమస్య లేదు. వాళ్లకే లేని సమస్య మీకు ఎందుకు..? రష్మికకు పెళ్లయ్యాక ఆమె కూతురితో కూడా నటిస్తా. వాళ్లకు లేని ప్రాబ్లమ్స్ మీకెందుకు..?’ అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం సల్మాన్ రియాక్షన్ నెట్టింట వైరల్ అవుతోంది. బాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్టులలో సికందర్ ఒకటి. కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, సల్మాన్ ఖాన్ కాంబో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు. ఠఃఈ చిత్రంలో సత్యరాజ్ విలన్‌గా నటిస్తున్నాడు.

# హార్రర్, కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ..

టాలీవుడ్ యాక్టర్ వరుణ్ తేజ్ నటిస్తోన్న తాజా చిత్రం వీటీ15. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే కొరియన్ కనకరాజు  (వీటీ15 వర్కింగ్ టైటిల్) ఫస్ట్ లుక్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది. ఇండో–కొరియన్ హార్రర్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. ఈ మూవీ సోమవారం పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లో ఘనంగా మొదలైంది.  మేర్లపాక గాంధీ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి సినిమాలతో టాలీవుడ్‌లో డైరెక్టర్‌గా మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈ డైరెక్టర్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. కాగా వీటీ 15 ఫస్ట్ లుక్‌లో డ్రాగన్ డిజైన్ ఉన్న జాడిపై కోడ్ లాంగ్వేజ్‌తో ఉన్న క్లాత్ మంటలు అంటుకొని అనుమానాస్పదంగా కనిపిస్తుండగా.. సస్పెన్స్, కామెడీ ఎలిమెంట్స్‌తో కూడిన కథతో సినిమా ఉండబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఇక వేట హాస్యాస్పదంగా మారితే అంటూ పోస్టర్‌లో రాసిన క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచేస్తుంది. వరుణ్ తేజ్ చివరగా మట్కా సినిమాలో నటించగా.. బాక్సాఫీస్ వద్ద ఊహించని ఫ్లాప్ టాక్ మూటగట్టుకుంది. ఎఫ్ 3 తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ మేర్లపాక సినిమాపై భారీగానే ఆశలు పెట్టుకున్నాడు.



# నీటి వనరుల పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపండి

## - నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్‌గా నార్నూర్ ఎంపిక

### - వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక బ్లాక్‌గా ఎంపిక చేసిన నార్నూర్ మండలంలో నీటి వనరుల పునరుద్ధరణకు అవసరమై ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ యుగల్ జోషి సూచించారు. సోమ వారం న్యూఢిల్లీ నుంచి నీటి వనరుల పునరు జీవనం అమలుపై గుర్తించబడ్డ ఆకాంక్షాత్మక బ్లాక్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. చెరువుల్లో పూడికతీతతో నీటినిల్వలు పెరిగి, భూగర్భజలాల అభివృద్ధితోపాటు చెరువుల పరిధిలోని ఆయకట్టు సాగుకు నీరు అందు బాటులోకి వస్తుందన్నారు. ఈ దిశగా ఆకాంక్షా త్మక బ్లాకులల్లో ఏటీఈ చంద్ర ఫౌండేషన్ సాయంతో నీటి వనరుల పునరుద్ధరణ కార్యక్ర మాన్ని చేపట్టనుందన్నారు. అందుకు అవసర మైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో వినోద్కు మార్ పాల్గొన్నారు.



## రంజాన్ తోఫా పంపిణీ

**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ముస్లిం కుటుంబాలకు సోమ వారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశా రు. జిల్లా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి మధు సూదన్ రెడ్డి సహకారంతో50 కుటుంబాలకు బియ్యం, చక్కెర, సేమియా, డ్రై ఫ్రూట్స్ కూడిన కిట్లు అందజే శారు. కార్యక్రమంలో లయన్ దేవ రాజేశ్వర్, రాజన్న, మల్లారెడ్డి, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో మేకలు మృతి



**బెజ్జూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

కుక్కల దాడిలో 4 మేకలు మృతి చెందిన సంఘటన బెజ్జూర్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బెజ్జూరు గ్రామానికి చెందిన కావిడ బక్కయ్య చెందిన మేకలు ఇంటి సమీపంలో పెరట్లో కట్టేసి ఉండేలా రాత్రి వేళలో కుక్కలు దాడి చేసి మేకలను చంపేసినట్లు యజమాని బక్కయ్య తెలిపారు. సుమారు 40,000 ఆర్థిక నష్టం సంభవిం చినట్లు తెలిపారు. పిచ్చికుక్కల దాడి వల్ల తాము నష్ట పోయినట్టు తెలిపారు. పిచ్చి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం

**ఇచ్చోడ, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ వైపునకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పోలీసులు స్వాధీ నం చేసు కున్నారు. సోమవారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుం డగా అనుమానం వచ్చి లారిని తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉన్నట్లు తెలిపారు. లారీలో 290 క్వింటాళ్ళు పీడీఎస్ బియ్యం ఉన్నాయని పోలీసులు తెలిపారు.

## 'ఇథనాల్' ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

### అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లాలో జరిగిన ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక ఉద్య మంలో రైతులు, మహిళలపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహే శ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ జీరో అవర్లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. దిలావర్ పూర్ మండల కేంద్రంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో గ్రామంలో ప్రజలకు, పంటలకు ఇబ్బందులు తలెత్తుతాయని గ్రా మ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశారని తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి ఫ్యాక్టరీని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఉద్యమంలో పాల్గొ న్న రైతులు, మహిళలపై పెట్టిన కేసులు అలాగే ఉన్నా యని తెలిపారు. కేసులు ఎత్తివేయాలని కోరారు.

## రిమ్స్‌లో రక్తదానం



**ఆదిలాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ రిమ్స్ బ్లడ్ బ్యాంకులో యువ కులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా ప్రధాన కార్య దర్శి వినోద్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం, బ్రిటిష్ దోపిడీ, సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తితో సాగిన భగత్ సింగ్ రాజగురు, సుఖదేవ్‌లు నేటి విద్యార్థికి ఆదర్శమన్నారు.

## క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి



### డీఎంహెచ్‌వో సీతారాం

**ఆసిఫాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

క్షయవ్యాధి రహిత జిల్లాగా తిర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సీతారాం అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుంటే మందులు ఉచితంగా ఇస్తామని తెలిపారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్ర మంలో సిబ్బంది అజీముద్దీన్, పవన్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు. జైనూర్ మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నిర్మూలన, వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి అశోక్ తదిత రులు పాల్గొన్నారు. దహెగాంలో క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని వైద్యాధికారి అశ్విని సూచించారు. మం డల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.

## మాభూమి రథయాత్రను విజయవంతం చేయాలి



**ఇచ్చోడ (బోథ్), మార్చి 24 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను విజయవంతం చేద్దాం అనే కరపత్రాలను ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిఎస్పి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14, 2025 నుండి అదిలాబాద్ జిల్లా కేంద్రం డైట్ మైదానంలో ప్రారంభ సభతో మొదలయ్యే డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో గడప గడపకు వెల్లనుందని అంతేకాకుండా ఈ పాదయాత్ర 33 జిల్లాలు 612 మండలాలు 12 వేల గ్రామాల్లో మూడు సంవత్సరాల మూడు నెలల పాటు మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు చైతన్యం చేసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రభుత్వం ఏర్పాటు దిశగా ఈ యాత్ర కొనసాగిస్తామని అన్నారు. రాజ్యధికారమే లక్ష్యంగా తమ యాత్ర కొనసాగనుందన్నారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ జిల్లా ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బీసీ ఎస్సీ ఎస్టీల రైట్స్ అండ్ రాజ్యాధికార జేఏసీ నాయకులు వెంకటేష్, బోథ్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నాం

### యూనివర్సల్ బ్యాంకు ప్రగతికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు

### బ్యాంక్ చైర్మన్ వినయ్ కుమార్




**మంచిర్యాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

యూనివర్సల్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నదని చైర్మన్ వీ.వినయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూనివర్సల్ బ్యాంక్‌లో యూనివర్సల్ కో-ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ 47వ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 2024-25 అర్ధ వార్షిక సంవత్సరంలో రూ.48.28 లక్షలు(ఆడిట్ కానిది) నికర లాభం వచ్చిం దన్నారు. మంచిర్యాల, సీసీసీల్లో ఏటీ ఎం సౌకర్యం కల్పి స్తున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఇతర బ్యాం కుల కన్నా డిపాజిట్లపై ఎకు వ వడ్డీ ఇస్తున్నామని, బ్యాం కుకు రాలేని వారికి ఇంటికెల్లి సేవలు అందిస్తున్నామన్నా రు. బ్యాంకు ప్రగతి కోసం సహాయ సహకారా లు అంది స్తున్న వాటాదారులు, ఖాతాదారులు, రిజర్వ్ బ్యాంక్, సహకార శాఖ, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బ్యాంక్ ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ త్వరలో భూపాలపల్లి, గోదావరిఖనిలో బ్రాంచీలు నెలకొల్పుతున్నామని, చిన్న, మధ్య తరగతి ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తూ ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ జీ.పూర్ణచంద్ర రావు, డైరెక్టర్లు కేఎస్‌ఎం రావు, జీ.కృష్ణమూర్తి, శ్రీదేవి, బక్కయ్య, ప్రసాదరావు, రాజలింగు, భానుప్రకాశ్, రత్నం, సుశీల, భాగ్యలక్ష్మి, ఆదిత్య , శ్రీపతి శ్రీనివాస్, వాటాదారులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో భార్యాభర్తలకు జైలు

**బెల్లంపల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లిలోని ఓ దుకాణంలో దొంగతనానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలు శిక్ష పడింది. వన్టటౌన్ ఎస్ఏహెచ్ దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి పో స్టాఫీసు బస్తీకి చెందిన అజయ్ కుమార్ సహానికి బజారు ఏరియా ప్రాంతంలో బట్టల దుకాణం ఉంది. 2022 నవంబర్ 6న రాత్రి దుకాణంలో చోరీ జరిగింది. 250 గ్రాముల బంగారు బిస్కెట్లు, రెండు సెల్ఫోన్లు, రూ.5000 నగదు దొంగిలించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎసాచ్వో ఎం.రాజు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. బెల్లంపల్లి హన్మాన్బస్తీకి చెందిన భార్యాభర్తలు ఎండీ. బద్రుద్దీన్, అస్పియా సీరిన్పై కేసు నమోదు చేశా రు. సమగ్ర విచారణ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కో ర్టులో ఏడుగురు సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాస క్యూటర్ అజయ్ కుమార్ ప్రవేశపెట్టగా జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ జే.ముకేష్ విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో నిందితులకు ఆరు నెలల చొప్పున సాధారణ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపుపై విస్తృత ప్రచారం నిర్వహించాలి



## కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

వాంకిడి, మార్చి 24 (ప్రభాత సమాచారం) లే అవుట్ భూముల క్రమబద్ధీకరణలో భాగంగా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లింపులపై ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. వాంకిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన వివరాలను కార్యదర్శి శివను సోమవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకంలో ఎల్ఆర్ఎస్-2022లో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులు ఈ నెల 31వ తేదీలోగా 100 శాతం చెల్లించిన వారికి 25 శాతం రుసుము మినహాయింపు ఉందని ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలని గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చెపట్టాలన్నారు. పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి వార్డులు, సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అయిన నర్సుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. వ్యాక్సినేషన్ సెంటర్‌ను తనిఖీ చేసి పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ అందించాలని, గర్భిణులకు ప్రతి నెల పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ అవరణలో చేపట్టిన ఇందిరమ్మ సమూనా నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజీజోద్దీన్, వైద్యాధికారి వినయ్‌పాల్గొన్నారు.

**పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్..**

వాంకిడి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాజరును అడిగి తెలుసుకున్నారు. 100 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లతోపాటు అత్యవసర సేవల నిమిత్తం వైద్యసిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.



## 50 కిలోల నకిలీ
# పత్తి విత్తనాలు పట్టివేత

కాసిపేట, మార్చి 24 (ప్రభాత సమాచారం) కాసిపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గుడిమల్ల చంద్రయ్య ఇంట్లో ప్రభుత్వ నిషేధించిన 50 కిలోల నకిలీ విడి విత్తనాలను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. కాసిపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. వీటి విలువ లక్ష ఇరవై ఐదు వేలు ఉంటుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన 5గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

## దివ్యాంగుల సమస్యలను
# వెంటనే పరిష్కరించాలి

ఆసిఫాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం) జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీహెచ్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇస్తాంబిన్హసన్ సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలింకో సంస్థ ద్వారా నిర్ధారణ అయిన దివ్యాంగులకు సహాయక పరికరాలు వెంటనే ఇవ్వాలని, రాజీవ్ యువ వికాసం పథకంలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మూడునెలలకు ఒకసారి దివ్యాంగుల కన్వర్జెన్సీ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజయ్య, శ్రీనివాస్, మొండయ్య, తాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారా స్థావరాలపై
# ఎక్సైజ్ అధికారుల దాడి



బెజ్జూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం) మండలంలోని లంబడిగూడ, ముంజంపల్లి, బారెగూడ గ్రామంలో నాటు సారాస్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సిఐ రవి సోమవారం తెలిపారు. దాడులో, 25 లీటర్ల గుడుంబాను, 200 లీటర్ల బెల్లంపానకంను పట్టుకున్నారు. పాత నేరస్తులను (9) మందిని బెజ్జూరు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు సిఐ రవి తెలిపారు. ఈ దాడులలో ఎస్సై ఐ. సురేష్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

# బాధ్యతల స్వీకరణ

మామడ, మార్చి 24 (ప్రభాత సమాచారం) మామడ తహసీల్దార్ శ్రీనివాసరావు సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సుధాకర్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా, కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్గా పని చేసిన శ్రీనివాసరావు బదిలీపై మామడకు వచ్చారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు. మండల వాసులకు మెరుగైన సేవలను అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

# వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలి



కాగజ్‌నగర్, మార్చి 24 (ప్రభాత సమాచారం) కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు సోమవారం షీ టీం ఆధ్వర్యంలో సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్చార్జ్ ఎస్ఐ సునీత మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలైన ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్, తదితర వంటి వాటి వినియోగంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులు ఎటువంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు. బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు.

# అటవీ శాఖ వేధింపులు ఆపాలి

ఖానాపూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం) ఖానాపూర్ మండలం పాత తర్లపాడ్ గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు 1991లో సర్వే నంబర్ 113లో ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున భూమి కేటాయిస్తూ పట్టాలు మంజూరు చేశారు. 34 ఏళ్లుగా ఇందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, భూమి అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, బ్లేడ్ ట్రాక్టర్, జేసీబీ లాంటివి ఉపయోగిస్తే సీజ్ చేస్తామని వేధిస్తున్నారని అటవీ శాఖ అధికారులు ఆంక్షలు, విధించడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని పాత తర్లపాడ్‌కు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన డీసీసీ అధ్యక్షుడు



సారంగాపూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం) సారంగాపూర్ మండలంలోని జామ్ గ్రామంలో సోమవారం రూ.10 లక్షల అంచనా వ్యయంతో మహాలక్ష్మి ఆలయం సీసీ రోడ్డు నిర్మాణ పనులను డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు 55 వేల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. నిరుద్యోగులు తమ కాళ్ళ మీద తాము నిలబడి ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం రాజీవ్ వికాస్ యోజన పథకం ద్వారా వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలను అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ప్రతిపక్ష పార్టీలు లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు కేటాయించడం లేదని, వారి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని అన్నారు. తెలంగాణలో బీజేపీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మహాలక్ష్మి ఆలయాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, నవీన్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభకు
# ముక్రా(కె) గ్రామస్థుల విరాళం



ఇచ్చోడ, మార్చి 24 (ప్రభాత సమాచారం) బీఆర్ఎస్ హయాంలో ఆ గ్రామం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది. ఆ గ్రామమే నేడు బీఆర్ఎస్ వేడుకల నిర్వహణకు గాను స్వచ్ఛందంగా విరాళాన్ని అందజేసి మరో సారి ఆదర్శంగా నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా (కె) గ్రామస్థులు ఏప్రిల్ 27న వరంగల్లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రూ. 1,02,003 విరాళాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేయాలని నిర్ణయించారు. సోమవారం మాజీ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో గ్రామస్థులు ఇంటింటికి విరాళాలు సేకరించారు. బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో గ్రామంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల ఫలితంగా ఉపాధి ఎంతో మెరుగుపడిందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉన్న తాము వరంగల్ సభకు అందరం వెళ్తామని నిర్ణయించారు.

## ప్రజావాణి దరఖాస్తులు
# సత్వరమే పరిష్కరించాలి

ఆసిఫాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం) ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌కు చెందిన అజిత్ మే తాను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల పాక నిర్మించానని, బిల్లు మంజూరు చేయాలని, కౌటాల మండలం బాదంపల్లికి చెందిన కొండగుర్ల రాజ్‌కుమార్ దళిత బంధు పథకం కింద రైస్ మిల్లు నిర్మించుకున్నానని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, కెరమెరి మండలం కేస్లాగూడకు చెందిన గోదావరి పీఎం విశ్వకర్మ పథకంలో శిక్షణ పూర్తి చేశానని రుణ సౌకర్యం కల్పించాలన్నారు.

# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత




**- విక్రయించే వారిపై పీడీ యాక్టు**
**- మంచిర్యాల డీసీపీ భాస్కర్**

**తాండూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

మండలంలో 2.47 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలను తాండూర్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన మనోహర్ ఈ నెల 20న ఐచర్ వ్యాన్‌లో పల్లీల లోడును మధ్యప్రదేశ్‌లో దింపి తిరుగు ప్రయాణంలో నాగ్‌పూర్‌లో ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలతో పాటు 11 బ్యాగుల్లో 550 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లను తాండూర్‌కు రవాణా చేశాడు. సోమవారం తాండూర్ మండలం అచ్చు లాపూర్, గోపాల్ నగర్ గ్రామాల మధ్య సన్యాసి మఠం అటవీ ప్రాంతంలో నకిలీ పత్తి విత్తనాల బ్యాగులను కారులోకి మారుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. ఐచర్‌వ్యాన్, కారు డ్రైవర్లు సెగ్యం సందీప్, గాడిపల్లి సత్యనారాయణ, బోగే సాయికిరణ్ కుమార్‌లను, నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడానికి వచ్చిన నారాయణ, రమేష్, వెంకటేష్, సత్యం, తిరుపతిలను అరెస్టు చేశారు. 2.47 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు, కారు, ఐచర్‌వ్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాల దందాలో ప్రధాన సూత్రధారి మనోహర్ రెడ్డి, మరో కొనుగోలుదారు మల్లేష్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. విత్తనాల విలువ రూ. 6,17,500 వరకు ఉంటుందని వివరించారు. నకిలీ విత్తనాలు అంటగడితే పీడీ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నకిలీ పత్తినాల కేసులు ఐదు నమోదు చేశామని పేర్కొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిత్యం తనిఖీ నిర్వహించడం జరు గుతుందన్నారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య, మండల వ్యవసాయ అధికారి సౌమ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**కౌటాల, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు సత్తా చాటాలన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, రా జ్యాంగాన్ని కాపాడాలని జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు విశ్వనాథ్, నానయ్య, నాయకులు తిరుపతి, రవీందర్ గౌడ్, గట్టయ్య, ఐశం, భీంరావ్, సోమయ్య, బండు, కుశల్రావు తదితరులు పాల్గొన్నారు.

**క్రీడల్లో గెలుపోటములు సహజం...**

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న కౌటాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. మొదటి బహుమతి గేమ్ ఛేంజర్ జట్టుకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి ఎస్ఎన్ఎన్ జట్టుకు రూ. 50 వేల నగదు అందజేశారు. కాగజ్ నగర్ డీఎస్పీ రామానుజం, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, కౌటాల సీఐ ముత్యం రమేశ్, మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, ఎంపీడీవో కోట ప్రసాద్, ఎస్సై మధుకర్, నాయకులు తిరుపతి, రవీందర్ గౌడ్, అజ్మత్, పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న
ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి
జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా
సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు,
మండలాల వారిగా విలేకరు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

**రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా**



**కోటపల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సోమవారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధి గ్రామాలు, సరిహద్దు ప్రాంతాల వివరాలను, మావోయిస్టులకు సంబంధించిన కదలి కలు, సానుభూతి పరులు, మిలిటెంట్లు తదితర అంశాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందిని ఫిర్యాదుల వివరాలపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను తెలుసుకుని వారికి భరోసా నమ్మకం కల్పించాలని సూచించారు. పోలీసులకున్న సౌకర్యాలు, సమస్యలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎన్ఐబీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ ఉన్నారు.

# మంత్రి సీతక్కకు ధన్యవాదాలు

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఇంద్రవెల్లి, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర విభజన అనంతరం మల్లాపూర్ గ్రామం ఇంద్రవెల్లి మండలం నుండి సిరికొండ మండలంలో గత ప్రభుత్వం కల్పించిన, దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఆనాటి జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్, తాను పిసా కో ఆర్డినేటర్ హోదాలో ఉన్న సమయంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.నేడు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ గ్రామ ప్రజల సమస్యను జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క గుర్తించి మల్లాపూర్ గ్రామాన్ని మళ్ళీ ఇంద్రవెల్లి మండలం లో విలీనం చేయడంతో పాటు ఉట్నూర్ మండలంలోని సాకేర(జే) గ్రామం పేరు తప్పుగా జమాల్ నాయక్ తండా నమోదు అయిందని,మళ్ళీ ఆ గ్రామ పేరును సాకేర(జే)గా మార్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఇంద్రవెల్లి,ఉట్నూర్ ప్రజల తరఫున జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్ఎంఎంఎస్ఎ ఎంపికపై ఫిర్యాదు

**ఒకే కేంద్రంలో 61 మంది ఎంపికపై విచారణకు తల్లిదండ్రుల వినతి**

**ఖానాపూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

భైంసా పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ ఉర్దూ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రంలో 61 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ ఎంపిక కావడంపై విచారణ జరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సోమవారం ఫిర్యాదు చేశారు. గతేడాది నవంబర్ 24న జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష జరిగిందని తెలిపారు. ఇటీవల ప్రకటించిన ప్రొవిజినల్ లిస్టులో అధికారులు 68 మంది పేర్లు ప్రకటించగా, అందులో భైంసా కేంద్రానికి చెందిన వారే 61 మంది ఎంపిక కావడంపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. విచారణ చేసి మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. పుప్పాల గజేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

**ఆసిఫాబాద్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీడీ తిరుపతితో కలిసి విద్యార్థులను అభినందించారు. నిశ్విత్, కార్తికేయ, మనితేజ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి నెట్బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారని, హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

# అటవీ రేంజ్ కార్యాలయానికి తాళాం వేసిన మున్సిపల్ సిబ్బంది

**చెన్నూర్, మార్చి 24 (ప్రభాత సమాచారం)**

కొన్ని సంవత్సరాలుగా ఇంటి పన్ను చెల్లించడం లేదని మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి మున్సిపల్ సిబ్బంది తాళాలు వేశారు. ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని పై అధికారుల ఆదేశాల మేరకు ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఫారెస్ట్ రేంజ్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ పట్టించుకో వడంలేదని అందుకే తాళాలు వేశామని సిబ్బంది తెలిపారు.

